# సగటు తండ్రి

—వాణిశ్రీ.

హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి ఉత్సాహమంతా నీళ్ళు చల్లినట్లు చప్పగా చల్లారిపోయింది. తిలకం ఇంట్లో ఇనస్పెక్టర్ తిష్టవేసి మందుకొడుతున్నాడనే విషయం తెలిసి తోకముడిచాడు. ఆ రోజు క్షణం తీరికలేదు. మినిష్టర్‌గారు విడిదిచేసిన బంగ్లా దగ్గర డ్యూటీపడి ఎండలో కట్టెలా ఎండి ఎండి మాడిపోయాడు. అలా అలసిపోయినరోజు తిలకం ఇంట్లో రిలాక్స్ అవడం మామూలే. కాని ఇవాళ ఇన్‌స్పెక్టర్ శనిలా దాపురించి ఆ సుఖం లేకుండా చేశాడు.

"ఏం చేస్తాం ! కర్మ" ఈ రోజులేచి పొద్దున్నే ఎవడిమొఖం చూశానో అనుకున్నాడు.

నెమ్మదిగా సైకిల్ తొక్కుకుంటూ ఇంటికెళ్ళాడు. వేడి నీళ్ళలో స్నానంచేశాక కాస్త అలసట తీరింది. భోజనంచేసి పడక కుర్చీలో కూర్చుని తాంబూలం సేవిస్తూవుండగా భూదేవి వచ్చింది ! ! నాన్నా" అంటూ.

"ఏం కావాలమ్మా" నువ్వింకా నిద్రపోలేదా ?" అన్నాడు, ఆప్యాయంగా. అతనికి లేక లేక పుట్టినబిడ్డ భూదేవి.

"ఉహూ....నీ కోసమే చూస్తున్నా"

"ఎందుకమ్మా" ఏం కావాలి ?

"నాన్నా"

"ఊఁ...."

"ఈ రోజు కాలేజీలో...."

"ఏం జరిగింది చెప్పు ? మీ లెక్చరర్ తిట్టాడా ? మీ మేడమ్ కొట్టిందా ?....చెప్పు వాళ్ళ తోలువలుస్తాను...."

"అది కాదు నాన్నా"

"మరేమిటి చెప్పు"

"కాలేజీలో ఒక కుర్రాడు అల్లరిచేశాడు"

తిలకం దగ్గర ఇన్‌స్పెక్టర్ తిప్ప వేసినందుకు వర్రీ అవుతున్న మనసు కూతుర్ని ఎవడో అల్లరిపెట్టాడనే వార్త వినగానే పుండుమీద వాతపెట్టినట్లు భగ్గుమంది.

"ఆ.... అల్లరిచేశాడా ? నిన్నే....ఎవడువాడు ? వాడి అంతు తేలుస్తాను రాస్కెల్" అపర రుద్రుడయ్యాడు హెడ్.

"వాడో జులాయి వెధవ నాన్నా"

"అసలింతకీ ఏం చేశాడు ?"

"నేను ఫ్రెండ్స్‌తో కాలేజీకి వెళుతుంటే వెంటబడి 'భూదేవీ మౌనమా ?....దేవీ మౌనమా' అని పాటపాడాడు నాన్నా. నేనేమో కోపం వచ్చి చెప్పుతీసి విసిరాను."

"తగిలిందా ?"

"ఉహూ....లేదు"

"తప్పించుకున్నాడన్నమాట. వూ...."

"ఆ తర్వాత వాడు నాజడ పుచ్చుకొని లాగాడు నాన్నా"

"ఆ....అంత పనిచేశాడా ? చూస్తాను రాస్కెల్ని లాకప్‌లోతోసి కుళ్ళ బొడుస్తాను. మన దెబ్బంటే ఏంటనుకున్నాడో" నా బూటుకాలి తన్నులకి నేరం చెయ్యనివాడైనా చచ్చినట్టు వప్పుకుంటాడు వీడోలెక్కా రేపు వీడికి ఎవడు అడ్డంవస్తాడో వాడిబాబు చూస్తాను"

"వాడు అందర్నీ అల్లరి చేస్తాడు నాన్నా"

"అందర్నీ చేస్తే చేశాడు, మనకెందుకు? నిన్ను అల్లరిచేశాడంటే వాడి ఆయువు మూడినట్టే" అసలు నువ్వింత ఆలస్యం ఎందుకుచేశావు? వెంటనే నాకు ఫోనుచేస్తే అప్పుడేవచ్చి వాడిసంగతి తేల్చుకునేవాడిని లాకప్‌లో శవమైపోయేవాడుగా.

"ఫోను చేశానునాన్నా "నువ్వులేవు"

"ఆ—లేనా? అవునవును లేను. ఈరోజు మినిస్టరొచ్చాడని బంగ్లా దగ్గర డ్యూటీపడింది."

"రేపు నువ్వు కాలేజీకి రావాలి నాన్నా"

"అలాగే అలాగే" వాడి అంతు తేల్చకుండా వదుల్తానా? హెడ్ కూతుర్ని అల్లరిపెట్టి భూమ్మీద బతుకుదామనే?"

భూదేవి సంతోషించింది. తన జడపట్టుకుని అవమానించిన ఆ రౌడీ వెధవని తన తండ్రి పట్టుకుని చితగ్గొడుతున్నట్లుగా వూహించుకుని మురిసి పోయింది.

* * * *

మర్నాడు హెడ్ వెంకటస్వామి కూతురి వెంట కాలేజీకి బయలు దేరాడు. దారిలో భూదేవి స్నేహితురాళ్ళు కొందరు కలిశారు. నిన్న జరిగిన 'భూదేవి అవమానం' కథ గురించి హెడ్‌కి చెబుతుంటే అతని శరీరం పొంగింది. వాడికివాళ్టితో భూమ్మీద నూకలు చెల్లినట్లే అనుకున్నాడు. వాడు కనిపించగానే ముందు "రాజాబాబూ నీతో పనుందని" నెమ్మదిగా స్టేషన్‌కి పిల్చి వెళ్ళి అక్కడ వాడి భరతంపట్టాలి. జన్మలో మళ్ళీ ఆడపిల్లల జోలికి వెళ్ళ కుండా పచ్చడిచేసి వదలాలి వెధవని, హెడ్ మనసులోనే రిహార్సల్స్ వేసు కుంటున్నాడు.

అందరూ కాలేజీ కాంపౌండ్‌లోకి వెళ్ళారు. హెడ్ ఒక వేపచెట్టు నీడలో సైకిల్‌స్టాండ్‌వేసి నిల్చున్నాడు.

భూదేవి, ఆమె స్నేహితురాళ్ళు అతని పక్కనే నిల్చుని కాలేజీ లోపలకు వచ్చేవాళ్ళను పరీక్షగా చూస్తున్నారు. అందులో నిన్న అల్లరిచేసిన రౌడీ వెధవ కనిపిస్తాడేమోనని.

ఒక్కొక్కరు, ఇద్దరిద్దరు, ముగ్గురు నలుగురూ అలా జట్లుజట్లుగా ఆడ, మగ స్టూడెంట్స్ లోపలికి వస్తున్నారు.

ఇంతలో ఫస్ట్‌బెల్ కొట్టారు.

"అమ్మా" నువ్వుండు. నీ ఫ్రెండ్స్‌ని వెళ్ళమని చెప్పు" పాపం బెల్ కొట్టారుగా అన్నాడు.

వాళ్ళంతా అయిష్టంగానే కదిలారు. వాళ్ళ మనసుల్లో ఎంతగానో కోరికగావుంది, ఆ రౌడీగాడి శృంగభంగం కళ్ళారాచూడాలని. ఎంతకీ రాలేదేం వెధవ. భూదేవి వాళ్ళనాన్ననిచూసి భయపడి దాక్కున్నాడేమో ? అంతే....అంతే లేకపోతే ఎందుకు రాడు ? నిన్న ఈపాటికి వచ్చాడుగా అనుకున్నారు.

రెండో బెల్‌కూడా కొట్టారు.

తర్వాత కొంత సేపటికి ఆ రౌడీ నెమ్మదిగా బూట్లు టకటక లాడించుకుంటూ దర్జాగా వచ్చాడు గేటుదాటి.

భూదేవి ముఖంలోకి వెలుగొచ్చింది.

"నాన్నా వాడే ఆ గళ్ళచొక్కావాడు" అంది చెయ్యెత్తి చూపించి —

హెడ్‌గారు ఆ కుర్రాడి ముఖం చూశాడు. అంతే !....అతని ముఖం పెనంమీద పెసరట్టులా మాడిపోయింది.

"ఆ.... బాబా" అన్నాడు గొంతులో తడారిపోతూండగా.

"అవును నాన్నా వాడే వెళ్ళిపట్టుకో" అంది భూదేవి ఆత్రుత పడుతూ.

ఆ రౌడీగాడు హెడ్‌నీ, భూదేవినీ ఒక్కక్షణం చూశాడు. తర్వాత చిరునవ్వు నవ్వాడు. నెమ్మదిగా వారున్న చోటుకి వచ్చాడు.

"ఏవోయ్ వెంకటసామీ ఇలా గొచ్చావ్ ?" అని పరామర్శించాడు.

హెడ్ విత్తరపోతూ అటెన్షన్‌లోకివచ్చి సెల్యూట్ కొట్టాడు.

"ఏం లేదు బాబుగారూ, అమ్మాయికి కాలేజీ ఫీజులు కట్టాలని .... హి....హి...." నీళ్ళు నమిలాడు.

"ఈ అమ్మాయి మీ అమ్మాయా ?" అన్నాడు తనుకొంచెం ఆశ్చర్యం నటిస్తూ.

"ఆ....అవును బాబుగారూ"

"ఓ... ఐసీ.... వెరీ సిల్లీ గర్ల్...."

"హి....హి....హి" ఏడవలేక చిరునవ్వు ముఖానికి తగిలించు కున్నాడు.

"అచ్చం సూర్యకాంతం అనుకో....నిన్న నామీద చెప్పు విసిరే సిందోయ్"

"ఆ అలాగా, ఏవమ్మా తప్పుకదూ ! చెప్పు విసిరెయ్యొచ్చా" హి....హి....తప్పైపోయింది బాబుగారూ.

"నెవర్ మైండ్"

బాబుగారు భూదేవివైపు సిల్లీ గాచూసి కొంటెగా కన్నుగీటి నెమ్మ దిగా వెళ్ళిపోయాడు.

భూదేవికి ఏడుపొకటే తక్కువ.

"ఎవడు నాన్నా వీడు ? నువ్వు బాబుగారు బాబుగారు అంటున్నావ్?" హీన స్వరంతో అడిగింది.

"ఈ పేడిమొఖం నా కొడుకు డియస్పీ దొరకాడుకమ్మా...." సాలెగూట్లో చిక్కుకున్న ఈగలాగ కొట్టుకుంటూ నిస్సహాయంగా అన్నాడు హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి.

(ప్రచురణ : ఉదయం వీక్లీ)

....o....